# దళారుల చేతులలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములు

**ప్రభుత్వమే స్పందిస్తే..**
**సామాన్య, నిరుపేదలకు చట్ట ప్రకారంగా న్యాయం చేసే అవకాశం**
**దళారులు, మధ్యవర్తుల చేతులల్లో మోసపోతున్న సామాన్య నిరుపేదలు**
**మాజీ ఎంపీటీసీ మంగళ రాము**



అనంతపురం, ఆగస్టు 21 అనంత సూర్య : దళార్లు, మధ్యవర్తుల చేతులల్లో లక్షలు చేతికిచ్చి మోసపోతూ.. ప్రభుత్వ భూములల్లో గుడిసెలు, కొట్టాలు వేసుకుంటున్నా.. ఏమీ తెలియని అమాయక నిరుపేదలకు ప్రభుత్వమే అండగా నిలవవచ్చని మాజీ ఎంపీటీసీ మంగళ రాము పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ మంగళ రాము మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను, బంజరు భూములను తమ పితరుల యొక్క ఆస్తులుగా భావిస్తూ యదేచ్చగా లక్షలకు.. లక్షలు నిరుపేదల నుండి దండుకుంటూ ప్రభుత్వ భూములలో కొట్టాలు, గుడిసెలు వేయిస్తూ మధ్యలో ఉన్న కొందరు దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ప్రభుత్వ భూమిలో కొట్టాలు వేసుకొని ఎన్నో నెల నుండి తామున్నామని, ఈ స్థలానికి సంబంధించి మాకు పట్టాలు కావాలని వారు కోరడం, రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి కాబట్టి ఇది చట్ట విరుద్ధమని తిరస్కరించడం ఎప్పటి నుంచో జరుగుతూనే ఉందన్నారు. మధ్యవర్తులుగా, దళారులుగా నిరుపేదల నుండి కొట్టాలు వేసుకోవడానికి వారి నుండి డబ్బులు దండుకున్న వారు మాత్రం కోట్లకు కోట్లు పడగలెత్తుతున్నారు. ఇది తెలిసి తెలియక కొట్టాలు, గుడిసెలు వేసుకున్న వారు మాత్రం నిస్సహాయ స్థితిలోనికి వెళ్లి చివరకు ఆ భూమి ప్రభుత్వ భూమిని తెలిసి వారికి ఆ భూమిపై ఎటువంటి అధికారం ఉందని తెలిసి ధర్నాలు, నిరసనలు తెలిపే పరిస్థితుల్లోకి వస్తున్నారన్నారు. ఇది ఒక రెవెన్యూ మండల పరిస్థితికి సంబంధించిన విషయమే కాదు, అనంతపురం జిల్లాలోని ఏ ప్రాంతంలో చూసిన, ఏ నియోజకవర్గంలో చూసిన ఇదే వ్యవహారం కొనసాగుతూనే ఉందన్నారు. ఈ వ్యవహారంపై, సంఘటనపై ఎన్ని కథనాలు వెలబడుతున్నా.. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ సైతం ఇది చట్ట వ్యతిరేకమని చెప్తున్నప్పటికీ రెవెన్యూ అధికారుల ధన దాహానికి కొనసాగింపుగా ఏదో ఒక ప్రాంతంలో ఈ తతంగం జరుగుతూనే ఉందని విమర్శించారు. జిల్లాలోని అనేక ప్రాంతాలకు చెందిన అనేక మంది కూలీ, నాలి చేసుకుంటున్న సామాన్య ప్రజలు మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి, కొనడానికి, అమ్మడానికి వీలు లేదని చట్టం చెబుతున్న ఆ చట్టాలు మాకు వర్తించవంటూ.. రెవెన్యూ కార్యాలయంలోని కొందరు అధికారుల సహకారంతో ఇష్టానుసారంగా ఎక్కడబడితే అక్కడ ప్రభుత్వ భూములలో స్థానికులు కాకపోయినప్పటికీ, మాకు డబ్బు ఇవ్వండి చాలు రెవెన్యూ అధికారులను అనుకూలం చేస్తామంటూ మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ.. దళారులు కోట్లకు కోట్లు పడగలెత్తుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# వేదవ్యాస మహర్షి విగ్రహం స్థలాన్ని కేటాయించండి



అనంతపురం, ఆగస్టు 21 అనంత సూర్య : అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో శ్రీ వేదవ్యాస మహర్షి విగ్రహం ఏర్పాటు కోసం స్థలాన్ని కేటాయించాలని మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కోరారు. శుక్రవారం అర్బన్ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జశ్వంత్ వ్యాస్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, వేద సంప్రదాయాలకు ఆద్యుడైన మహర్షి వేదవ్యాసుడు ప్రపంచానికి మహాభారతం, భాగవతం, వేదాలు వంటి మహోన్నత గ్రంథాలను అందించిన మహనీయుడు అని, భారతీయ ఆధ్యాత్మికత, ధర్మ పరిరక్షణలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అలాంటి మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి నారాయణమూర్తి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కుర్లపల్లి విజయ్, జిల్లా ఇంచార్జి శివకుమార్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బండ్ల గణేష్ నివాసానికి ఎమ్మెల్యే పరిటాల సునీత

## కుమార్తె, అల్లుడికి ధర్మవరం పట్టు వస్త్రాలు ఇచ్చి శుభాకాంక్షలు

## పరిటాల రవితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న బండ్ల గణేష్

అనంత సూర్య:21: అనంతపురం: సినీనటుడు, నిర్మాత బండ్ల గణేష్ నివాసానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వెళ్లారు. గత ఆదివారం బండ్ల గణేష్ కుమార్తె జనని, అల్లుడు సూర్య తేజ వివాహం ఘనంగా జరిగింది. వివాహానికి పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ హాజరయ్యారు. ఆరోజు హాజరు కాలేకపోయిన ఎమ్మెల్యే సునీత శుక్రవారం ఫిల్మ్ నగర్ లోని బండ్ల గణేష్ నివాసానికి వెళ్లారు. గణేష్ దంపతులు ఎమ్మెల్యే సునీతకు ఘన స్వాగతం పలికారు. నూతన వధూవరులకు ఆమె ధర్మవరం పట్టువస్త్రాలు ఇచ్చి ఆశీర్వదించారు. అనంతరం



కుటుంబసభ్యులతో ఆత్మీయంగా గడిపారు. శ్రీరాములయ్య సినిమా సమయం నుంచి బండ్లగణేష్ కు పరిటాల కుటుంబంతో అనుబంధం ఉంది. ఆ సినిమాలో నటించిన బండ్ల గణేష్ పరిటాల రవితో సన్నిహితంగా ఉండే వారు. ఆ రోజులను గణేష్ మరోసారి గుర్తు చేసుకున్నారు. పరిటాల రవితో అనుబంధాన్ని మరువలేనిదని గణేష్ అన్నారు..

# నూతన భవనంలో

## తలుపుల ఏపీజీబీ శాఖ ప్రారంభం

తలుపుల, ఆగస్టు 21 అనంత సూర్య : తలుపులలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు శాఖను ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో నూతన భవనంలోకి మార్చారు. ఇప్పటివరకు ఉన్న భవనం సౌకర్యవంతంగా లేకపోవడంతో ఖాతాదారులకు సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్న



నేపథ్యంలో నూతన భవనంలో శాఖను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్యాంకు జనరల్ మేనేజర్ శ్రీ కె. జనార్ధనరావు హాజరయ్యారు. సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు రాష్ట్రవ్యాప్తంగా అందిస్తున్న వివిధ సేవలను ఖాతాదారులకు వివరించారు. బ్యాంకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా పురోగతి సాధించాలని కోరారు. రీజినల్ మేనేజర్ శ్రీ ప్రసాద్ మాట్లాడుతూ ఖాతాదారులు బ్యాంకు అందిస్తున్న సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. నూతన భవనం ద్వారా ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారి కె.వి. నిరంజన్ కుమార్, సీనియర్ మేనేజర్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ చిరుతల మల్లికార్జున అకాల మరణం

## – స్వగ్రామంలో మిన్నంటిన రోదనలు..

అనంత సూర్య:21: రాప్తాడు: విధుల నిర్వహణలో భాగంగా గురువారం సాయంత్రం రాప్తాడు నుంచి ధర్మవరానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, రాప్తాడు మండలం రామనేపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే దుర్మరణం చెందిన కానిస్టేబుల్ చిరుతల మల్లికార్జున భౌతికకాయానికి శుక్రవారం ఉదయం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)లో పోస్టుమార్టం పూర్తయింది. అనంతరం ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన రాప్తాడుకు తరలించగా, గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. కానిస్టేబుల్ మల్లికార్జున భౌతికకాయం స్వగృహానికి చేరుకోగానే ఆయనను కడసారి చూసేందుకు గ్రామ ప్రజలు, బంధువులు, స్నేహితులు మరియు తోటి పోలీస్



సిబ్బంది వందలాదిగా తరలివచ్చి పూలమాలలు వేసి అశ్రునయనాలతో నివాళులర్పించారు. గుడిబండ రొళ్ల, చెన్నేకొత్తపల్లి, రామగిరి పోలీసు స్టేషన్లలో విధులు నిజాయితీగా నిర్వర్తించాడు. నిరంతరం అందరినీ ఆప్యాయంగా పలకరించే మల్లికార్జున అకస్మాత్తుగా దూరమవ్వడాన్ని జీర్ణించుకోలేక కుటుంబ సభ్యులు చేసిన రోదనలు అక్కడున్న వారందరినీ కంటితడి పెట్టించాయి. ఇంటి వద్ద నుంచి స్మశాన వాటిక వరకు సాగిన అంతిమయాత్రలో ఆయన భౌతికకాయాన్ని దర్శించుకునేందుకు ప్రజలు దారిపొడవునా బారులు తీరారు. అనంతరం స్మశాన వాటిక వద్ద అంత్యక్రియల సమయంలో రాప్తాడు, రామగిరి సిఐలు వెంకటేసులు, ఎం.ఎం. వలి, రిజర్వ్ ఇన్స్పెక్టర్ వలి ఆధ్వర్యంలో, పోలీసు బలగాలు గాలిలోకి కాల్పులు జరిపి (గన్ సెల్యూట్) సంపూర్ణ అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం తరపున మల్లికార్జున సతీమణి నిర్మలకు పోలీస్ అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సూర్యకుమార్, హరినాథ్, లక్ష్మీనారాయణ, శివప్రసాద్ లు రూ.లక్ష తక్షణ సాయం అందజేశారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలు

## పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా

## – డిపిఓ నాగరాజు నాయుడు

అనంత సూర్య, ఆగస్టు, 21: అనంతపురము జిల్లాలో 31 మండలాలు, 3 రెవెన్యూ డివిజన్లు, 577 గ్రామ పంచాయతీలు, 13,65,922 మంది ఓటర్లు, 5,840 వార్డులు, 6,054 ప్రస్తుత పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 576 గ్రామ పంచాయతీలకి ఎలక్షన్స్ జరగనున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ చేపట్టినట్లు జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు. సంబంధిత గ్రామ పంచాయతీలలో పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలను ప్రజల పరిశీలనార్థం 23.08.2026 వ తేదీన జిల్లా లోని అందరు ఎంపీడీఓ లు ప్రచురించడం జరుగుతుంది అని తెలియచేశారు.



ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే 26-08-2026లోపు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు. అందిన అభ్యంతరాలు, సూచనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని, అనంతరం 30-08-2026న తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రచురించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు. కావున ఓటర్లు, ప్రజలు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులు ముసాయిదా జాబితాను పరిశీలించి, అవసరమైన అభ్యంతరాలు లేదా సూచనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని. శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో డీపీవో కోరారు.

# కనక దాస్ హెల్పింగ్ ఫౌండేషన్ కన్వీనర్ గా మకర నాగరాజు(రోలర్)..

అనంత సూర్య: ఆగస్టు 21: అనంతపురం జిల్లా కనకదాస్ హెల్పింగ్ ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ గా ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండల పరిధిలోని, పి. నారాయణపురం గ్రామానికి చెందిన రోలర్ నాగరాజు ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆయన విలేకరులకు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏ కార్యక్రమంలో కో కన్వీనర్లు గా. బ్యాళ్ల మధుబాబు. బండి కృష్ణమూర్తి. ఆత్మకూరు సుబ్బర ధనుంజయ. ఎం సుధాకర్. బాలకొండ రామాంజనేయులు. చిత్ర ఈశ్వరయ్య. మల్లెల రామ్మోహన్. బండి రమేష్. కే హెచ్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ డా:ఎండి నాగభూషణం గారిచే నియామక ఉత్తర్వులు జారీ చేశారు ఈ సందర్భంగా కన్వీనర్లు కో కన్వీనర్లు కనకదాస హెల్పింగ్ ఫౌండేషన్ కొరకు శాయ శక్తులా.పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుబ కులస్తుల కు అన్ని రకాల నా



వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ నామీద నమ్మకముతో నాకు ఈ పదవి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం తో అందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు ఆయన తెలియజేశారు..

# జర్నలిజంలో డిప్లమో కోర్సు దరఖాస్తులకు గడువు పెంపు

పోరుమామిళ్ల ఆగష్టు 21:(అనంత సూర్య దినపత్రిక ప్రతినిధి) ఆంధ్రప్రదేశ్ సి. రాఘవాచారి మీడియా అకాడమీ, నాగార్జున యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న జర్నలిజం డిప్లమో కోర్సులో ప్రవేశానికి గడువును సెప్టెంబర్ ఐదో తేదీ వరకు పొడిగించినట్లు సంస్థ జచైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ తెలిపారు. జర్నలిస్టులుగా విధులు నిర్వహిస్తున్న వారు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత, జర్నలిజంలో అభిరుచి కలిగిన ఇతర అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణతతో ఈ కోర్సులో చేరొచ్చని సూచించారు. క్లాసులను ఆన్లైన్ విధానంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈఎ కోర్సులో చేరేందుకు జర్నలిస్టులు రూ.2 వేలు, ఇతర అభ్యర్థులు రూ.2,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ ఫీజును సెక్రెటరీ, సి.ఆర్.మీడియా అకాడమీ పేరున ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో సమర్పించాలని సూచించారు.

